తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు తుల ఉమ, సుమిత్రా ఆనంద్

కేసీఆర్ కాలంలో ఎండల్లేవా?

సర్కారు నిర్లక్ష్యంతోనే ఎండుతున్న పంటలు

ప్రకృతి వైపరీత్యం కాదు.. ప్రభుత్వ వైఫల్యం

- కేసీఆర్ ఇచ్చిన నీళ్లు రేవంత్ రాంగనే మాయమా?
- పాలన చేతగాక ప్రకృతి మీద కూడా నిందలా?
- వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండినయ్
- రైతులకు ఎకరాకు 10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలె
- 11 నెలల్లో ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే 21 వేల కోట్ల వడ్డీలేని రుణాలిచ్చామని అబద్ధం
- నిరుడు నవంబర్‌లో వరంగల్‌లో మహిళా సంఘాలకు స్వయంగా సీఎం ఇచ్చిన 35 కోట్ల చెక్కు లాప్స్ అయింది
- దానికి 9 కోట్లు కలిపి మళ్లీ రూ.44 కోట్ల చెక్కు ఇచ్చింర్రు
- సీఎం ఇచ్చిన ఈ చెక్కయినా డమ్మీ కాకుండా చూడండి
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : ఎండల వల్ల పంటలు ఎండుతున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు భగ్గుమన్నారు. పాలన చేతగాక ప్రకృతి మీద కూడా రేవంత్‌రెడ్డి నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. 'ఎండలకు పంటలు ఎండుతున్నయట! కేసీఆర్ ఉన్నప్పుడు ఎండలు లేవా? ఎండలు ముందు పుట్టినయా? రేవంత్ ముందు పుట్టిండా?' అని ఎద్దేవాచేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, రేవంత్ తెచ్చిన కరువని మండిపడ్డారు. 'ఒకవైపు ఏపీ మొత్తం నీళ్లు తీస్కపోయింది. దేవాదులలో కావల్సినన్ని నీళ్లున్నయి. మోటర్లు ఆన్ చేయలేదు. వరంగల్ జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతున్నది. రూ.7 కోట్ల బిల్లులు ఇవ్వలేదని దేవాదుల వద్ద కార్మికులు సమ్మె చేసింర్రు. 32 రోజులు మోటర్లు ఆన్ చేయలేదు. నీళ్లన్నీ కిందికి పోయినయి. కేసీఆర్ హయాంలో నీళ్లు రాంగనే మోటర్లు వేసేవారు. కాంగ్రెస్ సర్కారు కమీషన్లు కుదరక రూ.7 కోట్ల బిల్లు ఇవ్వలేదు. కేసీఆర్ హయాంలో ఎండాకాలంలో చెరువులు మత్తళ్లు దుంకేవి. కాల్వలు నీళ్లతో కళకళలాడేవి. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, రేవంత్ వైఫల్యం. బేలగా మాట్లాడి తప్పించుకోలేరు' అంటూ నిప్పులు చెరిగారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.10 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. తెలంగాణభవన్‌లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యురాలు సుమిత్ర ఆనంద్‌తో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు.

రూపాయి ఇవ్వకున్నా అబద్ధం

రూపాయి కూడా ఇవ్వకుండానే మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చినట్టు చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి మహిళలను మోసం చేశారని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో పరేడ్‌గ్రౌండ్ సాక్షిగా సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. 'నేను గత అసెంబ్లీలో వేసిన ప్రశ్నకు మంత్రి సీతక్క ఇచ్చిన సమాధానం ప్రకారం.. 5 లక్షల వరకే ఎస్‌హెచ్‌జీ, స్త్రీనిధి రుణం తీసుకుంటే వడ్డీ లేని రుణమని చెప్పారు. 2015లో కేసీఆర్ ప్రభుత్వం ఈ జీవో ఇచ్చింది. రూ.5 లక్షలకు మించితే తీసుకున్న రుణంపై బ్యాంకులు 12.5 శాతం చార్జ్ చేస్తున్నాయి. రూపాయి కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వకుండానే మొత్తం 21 వేల కోట్లు ఇచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో చెప్పి మహిళలను దగా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు పెంచుతమన్నరు. 15 నెలలైనా పట్టించుకోలేదు. మహిళా దినోత్సవం నాడైనా జీవో ఇస్తరనుకున్నం. కానీ, అవే అబద్ధపు మాటలు, బీఆర్ఎస్‌పై నిందలు తప్ప ఇచ్చిందేం లేదు. మీ అబద్ధాలు వినలేక మహిళలు వెళ్లిపోయే ప్రయత్నం చేసింర్రు. వారు వెళ్లకుండాగేట్లకు తాళాలు వేసి నిర్బంధించింర్రు. వడ్డీపై లెక్కలతోసహా శ్వేతపత్రం విడుదల చేయాలి' అని డిమాండ్ చేశారు. ఎంత రుణం తీసుకుంటే వడ్డీ లేని రుణం ఇస్తారో జీవో సవరించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుట్టుకూలి 75 ఎవరికిచ్చారో చూపండి

స్కూల్ యూనిఫాంల కుట్టుకూలి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.50 ఇస్తే తాము రూ.75కు పెంచినట్టు రేవంత్ మరో అబద్ధం చెప్పారని హరీశ్ మండిపడ్డారు. అదే నిజమైతే ఏ ఊరిలో ఇచ్చారో చూపించాలని సవాల్ విసిరారు. ఆఖరుకు మొబైల్ ఫిష్ వ్యాన్లను కూడా తమ ఘనతగా చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. పీఎం మత్స్య సంపద యోజన కింద సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్ రుణం తీసుకుంటాయని, దీన్ని కాంగ్రెస్ ఘనతగా చెప్పుకోవడం సిగ్గనిపించడం లేదా? అని మండిపడ్డారు.

సీఎం ఇచ్చిన చెక్కులే పాస్‌కావడం లేదు

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద జోక్‌గా మారిందని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వయంగా సీఎం అందజేసిన చెక్కులు కూడా పాస్ కావడం లేదని మండిపడ్డారు. 'ప్రజా పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా 2024 నవంబర్ 7న వరంగల్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.35 కోట్ల చెక్కును మహిళా సంఘానికి సీఎం అందించారు. అది క్లియర్ కాక, 3 నెలల తర్వాత లాప్స్ అయ్యింది. దానికి ఇంకో 9 కోట్లు కలిపి, మళ్లీ నిన్న రూ.44 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు సీఎం ఇచ్చింర్రు. ఇప్పుడైనా చెక్ పాసైతదా? లేదంటే ఇదే డ్రామా కంటిన్యూ అయితదా? సీఎం ఇచ్చిన చెక్కులు పాస్ కాకపోతే ఎలా? కమీషన్ లేనిదే చెక్ పాస్ కాదా ఏమిటి?' అని చురకలంటించారు.

రేవంత్ తరహాలోనే భట్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం సీఎం రేవంత్‌రెడ్డి తరహా అబద్ధాలు మాట్లాడుతున్నారని హరీశ్ విమర్శించారు. 'భట్టి గారంటే నాకు గౌరవం. రాజకీయాల్లో కొద్దో గొప్పో విలువలు కలిగిన నాయకుడనే పేరుంది. రేవంత్‌రెడ్డి దుష్ట సావాసంతో ఇప్పుడు భట్టి కూడా చెడిపోయారు. బాడీ షేమింగ్ చేయడం, అబద్ధాలు మాట్లాడటంలో రేవంత్‌తో పోటీ పడుతున్నరు.' అని అన్నారు.

రేవంత్‌రెడ్డిదే పైశాచికానందం!

'పైశాచికానందం ఎవరిది రేవంత్‌రెడ్డీ?' అని హరీశ్ నిలదీశారు. 'హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టించి.. లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేసి.. ఆశా వర్కర్లను పోలీసులతో కొట్టించి.. పేరు మర్చిపోయిండని అల్లు అర్జున్‌ను అరెస్టు చేయించి.. నిరుద్యోగుల వీపులు పగలగొట్టించి.. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పైశాచికానందం పొందింది నువ్వు. అధికారంతో కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నవ్' అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

సీఎం సలహా ఇవ్వమంటరు.. మంత్రి వద్దంటరు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిదో మాట మంత్రులదోమాట ఉంటున్నదని, వారిలో వారికే సమన్వయం లేదని హరీశ్ విమర్శించారు. 'గతంలో రుణమాఫీ విషయంలో సీఎం ఒక మాట అంటే, మంత్రులు మరో మాట అన్నరు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలను సలహాలివ్వాలంటున్నరు. మేం ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్తే మంత్రి ఉత్తమ్ వారికి ఎవరి సలహాలూ వద్దంటడు. ప్రమాదం జరిగి 16 రోజులవుతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదు. ఒక మంత్రి చాపర్‌లో తిరిగితే, మరో మంత్రి చేపల పులుసు తింటున్నరు. ఇరిగేషన్ చీఫ్ అనిల్‌కుమార్ ఈ రోజు వరకు అక్కడికి పోలేదు. ఆయనకు బాధ్యత లేదా?' అని హరీశ్ మండిపడ్డారు. ఇకనైనా అబద్ధాలు మాట్లాడకుండా పాలనపై దృష్టి పెట్టాలని, ప్రజలకు మేలు చేయాలని, సన్న వడ్లకు బోనస్ రూ.400 కోట్లను రైతులకు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ముందుచూపుతోనే ఖమ్మం సస్యశ్యామలం

కేసీఆర్ ముందుచూపుతోనే గోదావరి జలాలు సాగర్ ఎడమ కాల్వలో తాజాగా కలిశాయని, ఖమ్మం జిల్లా సస్యశ్యామలం అవుతున్నదని హరీశ్ చెప్పారు. 'కృష్ణా నది జలాలను ఏపీ తరలిస్తే, నేడు ఖమ్మం ప్రజలకు సీతారామ సాగర్ వరమైంది. కృష్ణా, గోదావరి సంగమం ఈ రోజు కేసీఆర్ వల్ల సాధ్యమైంది. ఖమ్మం రైతాంగానికి నీరు సరఫరా అవుతున్నది' అని పేర్కొన్నారు.

> రూపాయి కూడా ఇవ్వకుండానే మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలిచ్చినట్టు చెప్పి మహిళలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేసింర్రు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో పరేడ్ గ్రౌండ్ సాక్షిగా ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెప్పింర్రు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 15 నెలలైనా పట్టించుకుంటలేరు. –హరీశ్‌రావు

> బీఆర్ఎస్ ప్రభుత్వం స్కూల్ యూనిఫాంల కుట్టుకూలి రూ.50 ఇస్తే రూ.75కు పెంచినట్టు రేవంత్‌రెడ్డి మరో అబద్ధం చెప్పింర్రు. యూనిఫామ్స్ కుట్టే బాధ్యత మహిళా సంఘాలిచ్చినట్టు డబ్బా కొడుతున్నరు. అనేక మంది అధికారులను, మహిళా సంఘాలను అడిగిన. కేసీఆర్ సర్కారు ఇచ్చినట్టు రూ.50 మాత్రమే ఇచ్చింర్రని చెప్పింర్రు. రూ.75 ఇచ్చింది నిజమైతే ఏ ఊరిలో ఇచ్చింర్రో చూపించు! –హరీశ్‌రావు

> బీఆర్ఎస్ నేతలు సలహాలివ్వాలని సీఎం అంటే.. ఎవరి సలహాలూ వద్దని మంత్రి ఉత్తమ్ అంటడు. ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగి 16 రోజులవుతున్నా 8 మంది ప్రాణాల గురించి ప్రభుత్వానికి పట్టిలేదు. ప్రమాద స్థలాన్ని టూరిస్టు స్పాట్ లెక్క మార్చింర్రు. గ్రహణమైనా, గ్రహచారమైనా రేవంత్‌రెడ్డే! అసహనంతో రెచ్చిపోయి అబద్ధాలు మాట్లాడొద్దు. పాలన మీద దృష్టి పెట్టి ప్రజలకు మేలు చెయ్యండి. కమీషన్లు మానండి. – హరీశ్‌రావు

> ఈ సారి సగటు వర్షపాతం కంటే ఎక్కువ నమోదైంది. కృష్ణా, గోదావరి పొంగి ప్రవహించినయి. అన్ని రిజర్వాయర్లు నిండినయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ తెచ్చిన కరువు. కేసీఆర్ హయాంలో ఉన్న నీళ్లు రేవంత్ రాంగనే ఎందుకు మాయమైనయి? కేసీఆర్ నీళ్లను ఒడిసిపడితే.. రేవంత్ ఇడిశి పెట్టిండు. –హరీశ్‌రావు

> 'పైశాచికానందం ఎవరిది రేవంత్ రెడ్డీ? హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి పైశాచికానందం పొందింది నువ్వు. చిన్న పిల్లలు నీళ్ల డబ్బా, పుస్తకాలను తెచ్చుకుంటామంటే కూడా టైం ఇవ్వకుండా పైశాచికానందం పొందింది నువ్వు. లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేసి పైశాచికానందం పొందింది నువ్వు. ఆశ వర్కర్లను పోలీసులతో ఎగిరెగిరి కొట్టించి.. అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల వీపులు పగలగొట్టించి పైశాచికానందం పొందింది నువ్వు.. – హరీశ్‌రావు

మహిళా సంఘాలకు లక్ష కోట్ల రుణాలిచ్చినం

బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల రుణాలిచ్చినట్టు హరీశ్ స్పష్టంచేశారు. బీఆర్ఎస్ హయాంలో 10 వేల కోట్లు కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదని భట్టివిక్రమార్క అనడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క 2022-23లోనే రూ.13 వేల కోట్లు ఇచ్చినట్టు చెప్పారు. 'మేం అధికారంలోకి వచ్చే నాటికి అప్పటి కాంగ్రెస్ రూ. 2 నుంచి 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం సెర్ప్, మెప్మా, స్త్రీనిధి ద్వారా మొత్తం లక్ష కోట్ల రుణాలిచ్చినం. మీకు చేతనైతే రూ.2 లక్షల కోట్ల రుణాలివ్వండి. అంతేకాని అడిగేవారు లేరనుకొని ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. నేను చెప్పింది తప్పయితే అసెంబ్లీలో చర్చ పెట్టు. ఏ ఏడాది ఎంత ఇచ్చినమో లెక్కలతో సహా చెప్తా. నేను ఆర్థిక మంత్రిగా పని చేసిన. పచ్చి అబద్ధం మాట్లాడుతున్నవు.. ఇదేం చిల్లర రాజకీయం?' అని హరీశ్ నిప్పులు చెరిగారు.

రేపు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

- బడ్జెట్ సమావేశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు
- దిశానిర్దేశం చేయనున్న పార్టీ అధినేత కేసీఆర్

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. ఈ మేరకు పార్టీ అధినేత కేసీఆర్ ఉభయ సభల సభ్యులకు దిశానిర్దేశం చేయనున్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం ఒంటిగంటకు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ సూచనలు చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం సమావేశాలు ప్రారంభమవుతాయి.

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టికెట్ దాసోజుకే

మొదటిపేజీ తరువాయి...

నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయంపై అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు ఉద్యమకారుల్లోనూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో, తెలంగాణ భావజాలవ్యాప్తిలో ముందు నుంచి బలమైన గొంతును వినిపించిన నాయకుడిగా దాసోజు శ్రవణ్‌కు పేరుంది. నిజానికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి నుంచి నలుగురైదుగురు సీనియర్ల పేర్లు వినిపించాయి. పార్టీ అధినేత కేసీఆర్ అన్నివర్గాలు, అన్నిస్థాయిల ముఖ్యనేతలతో సమాలోచనలు చేశారు. చర్చోపచర్చల అనంతరం 'ఈసారి కొత్తవారికి అవకాశం కల్పించాలి' అని కేసీఆర్ నిర్ణయించి దాసోజు శ్రవణ్ పేరును ప్రకటించారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అదే సమయంలో సీనియర్ నాయకుల సేవలను పార్టీలో క్రియాశీలకంగా వినియోగించుకోవటమే కాకుండా సమీప భవిష్యత్తులో చట్టసభల్లో వారికి అవకాశాలు ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్టు ఆ వర్గాలు తెలిపాయి. కొత్తతరాన్ని ప్రోత్సహించటం, పార్టీకి సేవ చేస్తున్నవారిని ఆదరించటం అన్నది బీఆర్ఎస్ మొదటి నుంచి పాటిస్తున్న ఆదర్శానికి నిదర్శనమని దాసోజు శ్రవణ్ ఎంపికలో మరోసారి స్పష్టమైందని పార్టీ శ్రేణులు ఉదహరిస్తున్నాయి. 'ఒక అభ్యర్థిని చట్టసభలకు ఎంపిక చేయటం వెనుక పార్టీ అధినాయకత్వానికి అనేక అంశాల ప్రాతిపదిక ఉంటుంది. అన్నీ బేరీజు వేసుకొని అభ్యర్థిని ప్రకటిస్తారు. ఇప్పుడూ అలానే ప్రకటించారని అనిపిస్తున్నది' అని ఎమ్మెల్సీ అభ్యర్థి ఆశావహుల్లో ఒకరు పేర్కొనటం విశేషం. 'ఇప్పుడు అవకాశం రానంత మాత్రాన నిరుత్సాహపడం.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మరింత బలంగా ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తాం. అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. సీట్ల సంఖ్య పెరుగుతుంది. అప్పుడు మాకూ అవకాశాలు వస్తాయి' అని సదరు నేత పేర్కొనటం బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు సంకేతం.

బీజేపీ గవర్నర్ తొక్కిపెట్టినా.. బీసీ బిడ్డకే పట్టం

ఉద్యమకారుడు, బీసీ వర్గానికి చెందిన నాయకుడు దాసోజు శ్రవణ్, సత్యనారాయణను కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులుగా గతంలో ఎంపిక చేసింది. నాటి గవర్నర్ తమిళి సై వారి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. అణగారిన, బీసీ వర్గాలకు న్యాయం చేయాలనే సంకల్పంతో నాటి కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసి గవర్నర్‌కు పంపినా నాటి గవర్నర్ తొక్కిపెట్టారు. రాష్ట్ర గవర్నర్‌గా ఉంటూ బీజేపీ ఎంజెడాను అమలు చేసి నాటి కేసీఆర్ ప్రభుత్వంపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా దాసోజు శ్రవణ్ వంటి బీసీ బిడ్డకు అవకాశం కల్పించాలనే సంకల్పం నుంచి దూరం కాలేదని తాజా నిర్ణయం చాటిచెప్పటం విశేషం.

ఉన్నత విద్యావంతుడు.. ఉద్యమ నాయకుడు

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో దాసోజు శ్రవణ్ క్రియాశీలకంగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ వెంట ప్రధాన అనుచరుడిగా పనిచేశారు. అనేక వేదికల మీద తెలంగాణ భావజాలవ్యాప్తికి కృషి చేశారు. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో బడుగుల గొంతుకను వినిపించారు. బీసీ కులగణన చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై ఒత్తిడి తేవటంలో భాగంగా ఇటు పార్టీ పక్షాన, అటు న్యాయవాదిగా తన వాదనను బలంగా వినిపించారు. కులగణన చేయాలని కోర్టులో కేసు వేసిన తొలి నాయకుడిగా బడుగుల మనసులు గెలిచారు.

బయోడేటా

దాసోజు శ్రవణ్ కుమార్

పుట్టిన తేదీ: 1966 జూన్ 7

కులం: విశ్వకర్మ (బీసీ)

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1987లో విద్యార్థి నాయకుడిగా, ఆర్ట్స్ కళాశాల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. టెక్‌మహీంద్రా, హిటాచీ తదితర కంపెనీల్లోనూ జనరల్ మేనేజర్, హెచ్ఆర్ డైరెక్టర్ సహా పలు ఉన్నత హోదాల్లో పనిచేశారు. సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా ప్రస్థానం కొనసాగిస్తున్నారు.

సగర్వం.. కాకతీయుల కళావైభవం

తెలుగు విశ్వవిద్యాలయంలో 'కాకతీయల గురించి మరికొంత', 'విశ్వశిల్పి రామప్ప–రమణీయత' పుస్తకాలను ఆవిష్కరించిన శాసనమండలి విపక్షనేత మధుసూదనాచారి



బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

సాదరంగా ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, మార్చి 9 : పదేండ్ల కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సూరారంలో వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లి తండాకు చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే బీరం సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయక్, నాయకులు కిషన్‌నాయక్, చక్రీగౌడ్ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న రాజయ్య, చిత్రంలో బాలరాజు, ఆనంద్, ఆర్ఎస్ ప్రవీణ్

మాదిగలకు అనుకూలమని రేవంత్ నటన

- వెనుక మాలల్ని ఎగదోస్తున్న వైనం
- వర్గీకరణ తేలాకే ఫలితాలు ఇవ్వాలి
- లేదంటే ఉద్యోగాల భర్తీ నిలిపేయాలి
- మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరిని వీడాలని మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య హితవు పలికారు. మాదిగలకు అనుకూలంగా ఉన్నట్టుగా బయటకు నటిస్తూనే, వెనుక నుంచి మాలలను ఎగదోస్తున్నారని విమర్శించారు. మాయలమరాఠీ మాటలను ఇకనైనా బంద్ చేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ అయ్యాకే ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేపట్టాలని, అప్పటివరకు గ్రూప్స్ ఫలితాలను ఆపాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీలను మోసం చేయాలనే ఉద్దేశంతో ఆదరాబాదరాగా గ్రూప్స్ ఉద్యోగాలను నింపాలని చూస్తున్నారని, ఈ నెల 11న గ్రూప్-1 ఫలితాలను ప్రకటించనున్నట్టు కమిషన్ తెలిపిందని తెలిపారు. ఎస్సీ సబ్ క్యాటగిరీ విషయంలోనూ రేవంత్‌రెడ్డి మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణ నివేదిక తప్పుల తడకగా ఉన్నదని, దీనిపై మాదిగ, ఉపకులాలకు అభ్యంతరాలున్నాయని గుర్తుచేశారు. ఆర్థికంగా ఎదిగిన కులాలను గ్రూప్-ఏలో పెట్టారని ఆక్షేపించారు. రాష్ట్రంలో ఒక్క మాదిగ కులస్తులే 33.33 లక్షల మంది ఉన్నారని తెలిపారు. 15 లక్షల మంది ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని, ఆ లెక్కన మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాలని డిమాండ్ చేశారు. బుడగజంగాలను మాదిగల నుంచి వేరుచేశారని విమర్శించారు. వెనుకబడిన నేతకాని కులాన్ని గ్రూప్ సీలో చేర్చి మాలలతో కలిపి 5 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని అన్నారు.

సొరంగంలో ఒకరి మృతదేహం వెలికితీత

- టీబీఎం ఆపరేటర్ గుర్‌ప్రీత్‌సింగ్‌గా గుర్తించిన అధికారులు
- 16వ రోజు రెస్క్యూలో పురోగతి
- మిగతా వారి కోసం గాలింపు
- గురుప్రీత్ మృతికి కేటీఆర్ సంతాపం
- కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్
- 25 లక్షల పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం, గుర్‌ప్రీత్‌సింగ్ (ఇన్‌సెట్)

హైదరాబాద్, మార్చి9 (నమస్తే తెలంగాణ)/నాగర్ కర్నూల్/అచ్చంపేట: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ 16వ రోజైన ఆదివారం కొలిక్కి వచ్చింది. టన్నెల్‌లో గల్లంతైన 8 మందిలో ఒకరి మృతదేహాన్ని రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్(40)గా గుర్తించారు. ఇంకా ఏడుగురి కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. క్యాడవర్ జాగిలాల ద్వారా గుర్తించిన మానవ అవయవాల అన్వేషణలో భాగంగా మట్టి తొలగింపుతో తొలుత చేయి, కాలు భాగాలను గుర్తించారు. 12 గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసి, టన్నెల్‌లోనే ప్యాకింగ్ చేసి, లోకోట్రైన్ ద్వారా వెలుపలికి తీసుకొచ్చారు. కుడి చేతికి ఉన్న కడియం ద్వారా అతడిని గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. సొరంగం వద్ద సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లో మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించిన దగ్గరలోనే మరో మూడు మృతదేహాలు ఉన్నట్టు గుర్తించిన రెస్క్యూ బృందాలు వాటిని కూడా వెలికి తీసేందుకు సహాయ చర్యలు కొనసాగిస్తున్నాయి. గుర్‌ప్రీత్‌సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని తరణ్ జిల్లా చీమకలాన్. ఆయన రాబిన్స్ ఇండియా కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మృతదేహానికి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి, ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు పంజాబ్‌కు బయలుదేరి వెళ్లారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనలో 16 రోజుల నిరీక్షణ తర్వాత ఒక కార్మికుడి మృతదేహం లభించడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. పంజాబ్‌కు చెందిన కార్మికుడు గురుప్రీత్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని, మృతుడి కుటుంబానికి చెరో రూ.50 లక్షల చెప్పున రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మరోవైపు మృతిచెందిన టీబీఎం ఆపరేటర్ గుర్‌ప్రీత్‌సింగ్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. గుర్‌ప్రీత్‌సింగ్ మృతికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల పరిహారాన్ని బాధిత కుటుంబానికి అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బదావత్ తెలిపారు.

వ్యక్తిగత అనుబంధంతో సీఎంకు సమస్య చెప్పా

కేపీహెచ్‌బీ వాసి విమల వెల్లడి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధంతో వ్యక్తిగతంగా కలిసినప్పుడు కేపీహెచ్‌బీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించానని ఆ కాలనీకి చెందిన విమల తెలిపారు. 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో 'ముఖ్యమంత్రికి విన్నవించినా ప్రజాభవన్‌కు పరుగెత్తాల్సిందే'.. అనే శీర్షికతో ఆదివారం ప్రచురితమైన వార్తను ఆమె ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి వనపర్తి జిల్లాకు వచ్చినప్పుడు కలిశానని, ఆయన సూచనల మేరకు ప్రజాభవన్‌కు వెళ్లి చిన్నారెడ్డికి విన్నవించినట్టు వివరించారు. తమను సంప్రదిస్తే వాస్తవాలు పూర్తిగా తెలిసేవని పేర్కొన్నారు.

చేనేత రుణమాఫీకి 33 కోట్లు

హైదరాబాద్, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని చేనేత కార్మికుల రుణమాఫీకి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇందుకు రూ.33 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ఆదివారం పరిశ్రమలు, వాణిజ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ జీవో-56 విడుదలచేశారు. ప్రతీ కార్మికుడికి రూ.లక్ష వరకు రుణమాఫీ జరిగినట్టు జీవోలో పేర్కొన్నారు.